క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మక్తల్: మక్తల్ మండలం మంతన్‌గోడ్, కర్ని గ్రామాల్లో చలివేంద్రంను మక్తల్ ఎంపీడీఓ రమేష్ ప్రారంభించారు. వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో చలివేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, కార్యదర్శి అచ్యుత్ లు ఉన్నారు.

గోకుల్‌నగర్‌లో..



కొత్తపల్లి: మండలంలోని గోకుల్‌నగర్‌లో అధికారులు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎంపీడీఓ కృష్ణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దమ్‌గ్నాపూర్‌లో..



మద్దూరు: మండలంలోని దమ్‌గ్నాపూర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎంపీడీఓ నర్సింహారెడ్డి ప్రారంభించారు. ప్రతి గ్రామంలో రద్దీగా ఉండే ప్రదేశాల్లో, ప్రధాన రహదారులపై చలివేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శి కల్పన ఉన్నారు.

అప్పంపల్లిలో..

మరికల్: ఎంపీడీఓ ఆఫీసులో, మండలంలోని అప్పంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాలు ప్రారంభించారు.

పాఠశాలలో పాము.. ఆందోళనలో విద్యార్థులు



మక్తల్: మండలంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం నాగుపాము కలకలం రేపింది. పాఠశాల పక్కన దారి వెంట వెళ్తున్న రైతులు పాఠశాల ఆవరణలో చెత్తల్లో నాగుపాము చూసి కర్రతో కొట్టి చంపారు. పాఠశాల ఆవరణలో పాము కనిపించడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. పాఠశాల సమీపంలో చెత్తాచెదారం ఉండటం వల్ల పాములు అధికంగా వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీంతో సంగంబండ రిజర్వాయర్, ఊర చెరువు ఉండటంతో పాములు అధికంగా వస్తున్నట్లు తెలిపారు.

చెడు అలవాట్లకు బానిస కావొద్దు



నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాలలో బుధవారం షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది బాలరాజు, చెన్నప్ప మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా లక్ష్యం వైపు పయనించాలని తెలిపారు. అదే విధంగా మార్చి 21 నుంచి 10వ తరగతి పరీక్ష కేంద్రాల్లో తోటి విద్యార్థినులతో విద్యార్థులు సక్రమంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్‌ఖాన్, ఉపాధ్యాయులు శివ, అబ్దుల్ అలీం పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన ఎల్‌ఐసీ ఏజెంట్లు



నారాయణపేట రూరల్: ఢిల్లీలో జరిగే ఏజెంట్ల శాంతియుత ధర్నాకు ఆల్ ఇండియా లియాఫీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు నారాయణపేట నుంచి 50 మంది ఏజెంట్లు తరలి వెళ్లారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో 10 మంది ఎంపీలు పాల్గొని ఎల్‌ఐసీ ఏజెంట్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్లమెంట్‌లో మాట్లాడి న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నేతలు ఆనంద్, బసిరెడ్డి, నసీర్, లక్ష్మన్న, తిప్పన్న, చెన్నప్ప, బాలకృష్ణప్ప పాల్గొన్నారు.

జాబ్‌కార్డుల్లేక 'ఉపాధి'కి దూరం



మాద్వార్‌లో ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- ఆత్మీయ భరోసాకు ఉపాధి కూలీలే అర్హులు
- జాబ్ కార్డులు 1,10,818
- కూలీల సంఖ్య 21,236
- పనులు పొందిన కుటుంబాలు 48,368
- ఉపాధి పొందిన కూలీలు 75,563
- వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు 523
- 2025–26లో లేబర్ బడ్జెట్ రూ.27,24,460 లక్షలు

మక్తల్: జాతీయ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో జరుగుతున్న పనులను నిబంధనలు పెట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో జాబ్‌కార్డులు లేక చాలా మంది పేదలు ఉపాధి పనులకు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వం నిబంధనలు పాటించాలని ఉపాధి హామీ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో కూలీలకు బ్రేక్ పడింది. వంద రోజులు పూర్తి అయిన వారికి పనులు చేసేది లేదు. జాబ్‌కార్డు ఉండి కూలీ చేయని వారికి ఉపాధి పనుల్లో అవకాశం లభిస్తుందని అధికారులు తేల్చిచెప్పారు. గ్రామాల్లో కొత్తకోడళ్లు, కూతుళ్లకు 18 ఏళ్లు నిండిన వారికి జాబ్‌కార్డులు లేవు. దీంతో వేసవిలో పనులు లేక ప్రజలు బతుకు దెరువు కోసం వలస వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

మొగ్గుచూపుతున్న గ్రామాల్లో ప్రజలు..

జిల్లాలోని 13 మండలాల్లో 280 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ జాబ్ కార్డులు 1,10,818 ఉన్నాయి. మొత్తం కూలీల సంఖ్య 21,236, పనులు పొందిన కుటుంబాలు 48,368, పనుల పొందిన కూలీలు 75,563 ఉన్నారు. జిల్లాలోని కొత్తగా జాబ్ కార్డులు జారీ ప్రక్రియను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసింది. జిల్లాలో ప్రజలకు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రజలంతా వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. వ్యవసాయ కూలీలకు, భూమిలేని పేద కుటుంబాలకు ఉపాధి హామీ పనులే దిక్కవుతున్నాయి. జనవరి నుంచి జూన్ వరకు ఉపాధి పనులు కూలీలకు బాసటగా నిలుస్తున్నాయి. ఈజీఎస్ కింద కూలీలకు చెల్లించే రోజువారి కూలీ సైతం పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరికి జాబ్ కార్డులు లేకపోవడంతో ఉపాధి పనులకు దూరమవుతున్నారు.

ప్రభుత్వ నిబంధన మేరకు..

రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి పని చేసి ఉండాలనే నిబంధన పెట్టడంతో గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీలు మొగ్గు చూపుతున్నారు. ఏడాదిలో 20 రోజులు ఉపాధి పని చేస్తే ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుంది. కొత్తగా జాబ్ కార్డుల కోసం గ్రామాల్లో కూలీలు దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వాటిని అమలు చేయనున్నారు. ఆత్మీయ భరోసా పథకంలో ఏడాదికి రూ.12 వేలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కూలీల దగ్గర జాబ్ కార్డులు లేకపోవడంతో ఇతరుల దగ్గర జాబ్ కార్డులు తీసుకోని కూలీ పని చేస్తున్నారు. గ్రామాల్లో కూలీ పనులు చేసేందుకు వస్తున్నప్పటికి జాబ్ కార్డులు లేకపోవడంతో కూలీలకు తలనొప్పిగా మారింది. ఇతరుల పేరు మీద ఉపాధి పనికి వెళ్తే కూలీ డబ్బులు వచ్చే సమయంలో వారు ఇద్దరు బీపీఎం వద్దకు వెళ్లి బయోమెట్రిక్ తీసుకోని పని చేసిన కూలీలకు డబ్బులు ఇస్తున్నారు. ఇల్లా ఒప్పందంతో పనులు చేసుకుంటున్నారు.

20 రోజులు ఉపాధి పని చేస్తేనే ఆత్మీయ భరోసా..

ప్రభుత్వం చేపట్టిన ఆత్మీయ భరోసా పథకం వర్తించాలంటే ఉపాధి హామీ పథకంలో కచ్చితంగా 20 రోజులు చేసి ఉండాలి. అలాంటి వారే ఈ పథకానికి అర్హులు. దరఖాస్తు చేసుకున్న వారికి జాబ్‌కార్డులు లేవు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే వాటిని విడుదల చేస్తాం. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.

– మొగులప్ప, డీఆర్‌డీఏ పీడీ, నారాయణపేట

ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్: మండల కేంద్రంలో ముస్లింలకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి బుధవారం ఇఫ్తార్ ఇచ్చారు. రంజాన్ సందర్భంగా మసీదుల్లో ప్రార్థనలు ముగించిన అనంతరం ఎమ్మెల్యే వారితో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యువక మండలి ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీరన్న, సూర్యమోహన్‌రెడ్డి, రామకృష్ణ, సత్యన్న, రఘు, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నయ్య, గోవర్దన్, రామకృష్ణారెడ్డి, రాజు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఖోఖో జట్టు కెప్టెన్‌గా రూప



కెప్టెన్‌గా బి.రూప



ఉపాధ్యాయురాలు దీప



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మక్తల్: తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్టు కెప్టెన్‌గా మక్తల్ మండలం కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న బి.రూప ఎంపికైందని పాఠశాల జీహెచ్‌ఎం వెంకటయ్య తెలిపారు. మక్తల్‌కు చెందిన విశ్రాంత పీఈటీ గోపాలం పెద్ద కూతురు ఎస్‌ఐఎస్ ఖోఖో కోచ్ పీడీ బి.రూప అల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి మహిళ ల ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు న్యూ ఢిల్లీలో జరుగే జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ మహిళల తెలంగాణ జట్టు కెప్టెన్‌గా క్రీడాకారిణిగా ఆడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, కృష్ణమూర్తి, విలియం, డీవైఎస్‌ఓ వెంకటేష్‌శెట్టి, జిల్లా కార్యదర్శి విశ్రాంత పీఈటీ గోపాలం, నర్సింహగౌడ్, రమేష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

పారా అథ్లెటిక్స్ ఖేల్ ఇండియాకు జిల్లా వాసి

నారాయణపేట ఎడ్యుకేషన్: నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన కన్కప్ప టీ 44 క్యాటగిరీ లాంగ్‌జంప్‌లో పారా ఒలంపిక్స్ ఖేలో ఇండియాకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ రమణ తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఢిల్లీలో జరిగే ఖేల్ ఇండియా నేషనల్ గేమ్స్‌లో అయన పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మైనారిటీ విద్యార్థులు



క్రీడాకారుడికి క్రీడా దుస్తులు అందిస్తున్న రమణ

జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియోషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించగా, 100 మీటర్ల పరుగుపందెం, జావెలిన్ త్రో విభాగంలో నారాయణపేట మైనారిటీ గురుకుల విద్యార్థులు బి.మల్లేష్, ఉజ్వల్ నాయక్, శివ నాయక్, ఎస్.మల్లేష్‌లు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 23న హైదరాబాద్‌లోని కొల్లూరు గాడియం స్పోర్ట్స్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్‌లో ఆడనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

జాతీయ స్థాయి క్రీడాపోటీలకు..

మాగనూర్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసులో జాతీయస్థాయి ఖోఖో పోటీలకు మాగనూర్ మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు దీప ఎంపికైనట్లు జిల్లా డీవైఎస్ వెంకటేష్‌శెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 24 తేదీలలో సికింద్రాబాద్ జింఖానా స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసు జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొని ప్రతిభ, క్రీడా నైపుణ్యం ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. దీంతో ఆమె జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీలకు ఎంపికై రాష్ట్ర జట్టు తరుపున ఆడతారని తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



అప్పిరెడ్డిపల్లిలో ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్/ధన్వాడ/మాగనూర్: ఆయా మండలాల్లోని గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అప్పిరెడ్డిపల్లి యూపీఎస్‌లో, బుడ్డమర్రితండా పాఠశాలలో, అడవిసత్యారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం బోధనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నర్వ: ఈ నెల 21 నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో నర్వ కేజీబీవీ(160), జెడ్పీహెచ్‌ఎస్ నర్వ(190) జెడ్పీహెచ్‌ఎస్ పెద్దకడ్మూర్(120) ఉన్నట్లు తెలిపారు. మొత్తం మూడు కేంద్రాల్లో 470 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ఇన్విజిలేటర్లుగా మొత్తం 22 మందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 21న తెలుగు, 22న హింది, 24న ఇంగ్లీష్, 26న మాథ్స్, 28న ఫిజిక్స్, 29న బయోసైన్స్, ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్ పరీక్షలుంటాయని, ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామన్నారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ మల్లారెడ్డి, ఎస్ఐ కురుమయ్య పేర్కొన్నారు.

సరస్వతీదేవికి విద్యార్థుల పూజలు



మరికల్: మండల కేంద్రంలోని సరస్వతీదేవి ఆలయంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు బుధవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మనోరంజని మాట్లాడుతూ పట్టుదలతో చదివి పదికి పది గ్రేడ్ సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేసి వారితో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు సరుకుల పంపిణీ



మద్దూరు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో నిరుపేద ముస్లింలకు, ఒంటరి మహిళలకు రేషన్ సరుకులు ఆర్‌ఎంపీ డాక్టర్ టిప్పు ఆస్పత్రిలో బుధవారం పంపిణీ చేశారు. 30 మందికి ఈ సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లింలు జబ్బార్, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు 'పది'కే పరిమితం కాకూడదు

కృష్ణా: బాలికల చదువు 10వ తరగతి వరకే పరిమితం కాకుండా ఇంటర్, ఆ పైన చదువులకు వెళ్లాలని, ఆ బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడు తీసుకోవా లని ఎంఈఓ నిజాముద్దీన్ సూచించారు. బుధవా రం గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణేష్‌సింగ్, ఉపాధ్యాయులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ నిజాముద్దీన్

కనుల పండువగా రథోత్సవం



శంకర్‌లింగేశ్వరస్వామి రథం లాగుతున్న భక్తులు

ఊట్కూరు: మండలంలోని సమస్తాపూర్ గ్రామ శివారులో ఇడ్లూరు శంకర్‌లింగేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ప్రభోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. సాయంత్రం 30 అడుగుల రథానికి రంగురంగుల పూలతో అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తులు రథాన్ని లాగారు. దేవాలయ ప్రాంగణం నుంచి సమీపంలోని రావిచెట్టు వరకు రథాన్ని లాగారు. ఈ వేడుకలు తిలకించేందుకు కర్ణాటక, తెలంగాణలోని వేలాది మంది భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇడ్లూరు భాస్కర్‌రెడ్డి, గోవింద్, జగన్నాథ్‌రెడ్డి, రాఘవేందర్ కులకర్ణి, తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

నారాయణపేట రూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని రిటైర్డ్ డీఈఓ జగదీశ్వర్ అన్నారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు క్రమశిక్షణ, సంస్కృతి సాంప్రదాయాలను నేర్పించాలని, క్రీడల్లో సాంస్కృతిక అంశాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుగంధమ్మ, జగన్మోహన్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి నాగార్జున రెడ్డి, ఏపీఓ సురేష్, ఏఎంసీ చైర్మన్ మణెమ్మ, కాంప్లెక్స్ హెచ్‌ఎం దత్తారావు, డీఎస్‌ఓ భానుప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణారెడ్డి

దామరగిద్ద: అనుకున్న లక్ష్యం సాధించేందుకు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మొగుల్‌మడ్క జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సులభం అన్నారు. కష్టమనే భావన వదిలి ఇష్టపడి చదవాలన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్ది ఆందోళన చెందకుండా ప్రశాంతమైన మనస్సుతో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అనురాధ, ఉపాధ్యాయులు బసదయ్య, శశిధర్, ప్రకాష్, అంజిలయ్య, భాగ్యమ్మ, మోహన్‌రెడ్డి, అబ్దుల్‌హై, వేణుగోపాల్, అంజిలప్ప, మల్లికార్జున్, భీరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గురువలింగంపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. వేసవి కాలం ఎండలు విపరీతంగా ఉంటున్నందున పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా ఓఆర్‌ఎస్‌ను నీటిలో కలుపుకుని తాగాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లు ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయం



నారాయణపేటలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ధన్వాడలో పాలాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మరికల్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట/ధన్వాడ/మరికల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో బీసీలకు రాజకీయాల్లో, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందడం చారిత్రాత్మక నిర్ణయమని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు ఎండీ. సలీం ఆధ్వర్యంలో బుధవారం నారాయణపేటలోని నర్సిరెడ్డి చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం బాణాలు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసి ఆ సర్వే ఆధారంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అన్ని పార్టీలను ఒప్పించి అసెంబ్లీలో బిల్లు పెట్టడంతో ఆమోదం పొందిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచడంపై సీఎంకు, స్థానిక ఎమ్మెల్యేకు బీసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పేట మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజు, మార్కెట్ వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతికుమార్ పాల్గొన్నారు.

- ధన్వాడలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డిల చిత్రపటాలకు మండల అధ్యక్షులు నరహరి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ రాజ్యాధికారానికి ఇది తొలిమెట్టు అని, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కలిస్తూ అసెంబ్లీలో చట్టబద్ధం చేస్తూ తీర్మానం చేయడం హర్షణీయమన్నారు.

కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ

- మరికల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యమోహన్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, హరీష్, కృష్ణయ్య, రామకృష్ణ, రాజు, చెన్నయ్య, రఘు, రామకృష్ణారెడ్డి, గోపాల్, సత్యన్న పాల్గొన్నారు.